## క్లుప్తంగా

### పన్నులు సకాలంలో చెల్లించండి

**అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు**



**తెనాలిఅర్బన్:** పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. చెంచుపేటలో బుధవారం ఆయన పర్యటించి పన్నులు చెల్లించని వారితో మాట్లాడారు. త్వరగా పన్నులు చెల్లించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం




**తెనాలిఅర్బన్:** క్రీడల వల్ల మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని స్పందన ఏడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏడా సామ్యూల్ రెడ్డి పేర్కొన్నారు. యువ క్రికెట్ ఆకాడమి 8వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రాత్రి చెంచేపేటలో నిర్వహించారు. క్రీడాకారులను తయారు చేస్తున్న ఆకాడమి కోచ్ మాలిక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, కన్నెగంటి మురళీ, పాలడుగు సురేంద్ర, పెసర్లంక రమణ, నాగిశెట్టి సాయిచరణ్, షేక్ అక్బర్, సాయిగోపి, తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



**తెనాలిటౌన్:** మండలంలోని కొలకలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామసాయి జ్ఞాన మందిర 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధ వారం కనులపండువగా ముగిశాయి. ఉదయం బాబా వారికి కాగడ హారతి, పంచామృత అభిషేకం, లక్ష్మిగణపతి హోమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని బాబా వారిని దర్శించి పూజాది కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో శ్రీరామసాయి ట్రస్ట్, శ్రీరామ సాయి జ్ఞాన మందిరం చైర్మన్ సంకా సతీష్, వైస్ చైర్మన్ మలిశెట్టి శ్రీనివాస్, సభ్యులు అకరంశెట్టి నాగేశ్వరరావు, ఎం.రోశిరెడ్డి, తోట నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం

**తెనాలిఅర్బన్:** రక్తదానం చేయటం వల్ల కొందరికి ప్రాణదానం చేసిన వారు అవుతారని ఎన్ఆర్కె అండ్ కె.ఎస్.ఆర్.గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ తెనాలి శాఖ చైర్మన్ ముమ్మలనేని భానుమతి, డాక్టర్ మేదూరి భాస్కరరావు, డాక్టర్ పావని ప్రియాంక, నాళం శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, దశరధరామిరెడ్డి, నరేష్, ఆసియా, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### సుల్తానాబాద్‌లో నేటి నుంచి రక్షణ సువార్త సభలు

**తెనాలిఅర్బన్:** దేవుని పరిశుద్ధాత్మ ఆలయం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో గురు, శుక్ర వారాలలో యేసుక్రీస్తు రక్షణ సువార్త స్వస్థత మహాసభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ హుస్సేనమ్మ, షేక్ ప్రభుకుమార్, షేక్ ఈసావలిలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు, రాత్రి 7గంటలకు సభలు జరుగుతాయని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే దైవ సేవకులు వాక్యపరిచర్య చేస్తారన్నారు. అందరు పాల్గొనాలని కోరారు.

### పిల్లల ఎదుగుదలకు కృషి చేయండి

**తెనాలిటౌన్:** పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల పెంపొందేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి–2 వి.జయంతి బాబు పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతిపై ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను మారీసుపేటలోని ఎన్వీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల ప్రాథమిక అభ్యాసనాన్ని మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్ కింద 120 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.సునీత, శిక్షకులు కె.సౌజన్య శ్రీ, రామరాజు, సీఆర్ఎంటీలు సిహెచ్ శ్రీదేవి, దీపాంజలి, శ్రీనివాస్, జీఆర్కె శాస్త్రి, జి.కామేశ్వరి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువులు, విక్రయించే వారిపై కఠిన చర్యలు



షాపులపై దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేయిస్తున్న కమిషనర్ శేషన్న

**మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న**

**తెనాలిఅర్బన్:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరు విక్రయించిన ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. మార్కెట్ ఏరియాలోని పలు షాపులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 మైక్రాన్‌ల కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు తెనాలి పట్టణంలో నిషేధించినట్లు తెలిపారు. వాటిని ఉపయోగించిన, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటి వలన పర్యావరణానికి హాని జరుగుతుందని వివరించారు. ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని సూచించారు. అనంతరం ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులున్నారు.

## ఆటపాటలతో కూడిన విద్యతో వికాసం



రేపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుచిత్ర



గోకర్ణమఠంలో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శేషుబాబు

**రేపల్లె రూరల్:** ఆటపాటలతో కూడిన విద్యను అందించటమే కాకుండా చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ ఎం.సుచిత్ర తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు ఎంపీహెచ్ఆర్ఎస్ స్కూలులో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీడీపీఓ అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు. చిన్నారులచే ప్లకార్డులు, ఆట వస్తువుల ప్రదర్శన ద్వారా చిన్నచిన్న పదాలు, వ్యాక్యాలు నేర్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేస్తూ ఉండాలన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అంగన్‌వాడీలు చిన్నారుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేయాలని కోరారు. ఉపాధ్యాయులు టి.సురేష్, ప్రభాకర్, సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపట్నం:** మండలంలోని గోకర్ణమఠం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం బుధవారంతో రెండవ రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శేషుబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు సీహెచ్ గణేష్‌రావు, ఎం.తులసీదాస్, ప్రసూన్న, గౌరీ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి

**ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి**



న్యాయవ్యాదులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

**రేపల్లె రూరల్:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి పట్టభద్రునిపై ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం న్యాయవాదులకు కరపత్రాలను అందజేసి మాట్లాడారు. అసెంబ్లీలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మాట్లాడాలన్నా, నిరుద్యోగ, ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై ధ్వజమెత్తాలన్నా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు మాత్రమే సాధ్యమన్నారు. పట్టభద్రులు ఎటువంటి ప్రలోభాలకు గురవ్వకుండా తమ అమూల్యమైన ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, నాయకులు యడ్లపల్లి కిషోర్‌బాబు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## సూర్యలంకకు పెరుగుతున్న పర్యాటకులు

- ఉధృతమవుతున్న ఎండలే కారణం
- మూడు నెలలు పాటు తీరంలో సందడే



సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి

**బాపట్ల:** వేసవి తాపం రోజురోజుకు పెరిగిపోవటంతో సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులతో తీరంలో సందడి నెలకొంటోంది. అయితే ప్రస్తుతం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎండ తీవ్రతకు తల్లడిల్లిపోతున్నారు. భగభగ మండుతున్న భానుడి తాపాన్ని తట్టుకునేందుకు సూర్యలంక తీరంలో సేదతీరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి రవాణా సౌకర్యం అనుకూలంగా ఉండటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తీరంలోనే గడుపుతున్నారు. ముఖ్యంగా బాపట్లతోపాటు గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు సుదూరప్రాంతాల నుంచి కూడా సముద్ర స్నానాలకు వచ్చేవారితో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. అదే విధంగా సముద్రతీరంలో జీడిమామిడి తోటలు అధికంగా ఉండటంతో స్నానాల అనంతరం ఆ తోటల్లో భోజనాలు చేసి జీడిచెట్ల కిందనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

## సురక్షిత ప్రసవాల కోసం కృషి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్‌మోహన్

**ఫిరంగిపురం:** సురక్షిత ప్రసవాల కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్ మోహన్ అన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ యాంటినేటర్, వ్యాక్సినేషన్ రిజిష్టర్లు, ఎంసీపీ కార్డులు పరిశీలించారు. రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ సిక్రోజ్ ఇంజక్షన్ చేస్తుండటాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి గర్భవతుల వివరాలు ఆర్సీహెచ్ పోర్టల్‌లో చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి వారికి ప్రతి నెలా పరీక్షలు చేసి, మందులు (ఎఫ్‌పీసీ)లో అందజేస్తున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత అనారోగ్యం ఉన్న గర్భిణులను హైరిస్కు కేసులుగా గుర్తించి, డాక్టర్ పర్యవేక్షణలో వారికి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 25వేల 772 మంది గర్భిణులు గుర్తించామని వారి పూర్తి వివరాలు నమోదు చేస్తామని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 351మంది గర్భిణులను గుర్తించి, పరీక్షలు, మందులు అందిజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిగా ఇప్పటి వరకు ఒక్క మాతాశిశు మరణాలు లేకుండా ఆరోగ్య సిబ్బంది పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎస్ఎంలు సుశీల, కోటేశ్వరమ్మ, లావణ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## దుకాణాలు తనిఖీ చేసిన లేబర్ ఆఫీసర్

**మంగళగిరి టౌన్:** చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దని మంగళగిరి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మూర్తి హెచ్చరించారు. మంగళగిరి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో పనిచేస్తున్న వారి వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులను పరిశీలించారు. లేబర్ లైసెన్స్ ఉండాలని, 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని వ్యాపారులకు సూచించారు.

### 'కూటమి' కోటీశ్వరుల ప్రభుత్వం

**కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్**



**మంగళగిరి టౌన్:** కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, బ్యాంకుల రుణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఆర్డీఏ కాంట్రాక్ట్‌లన్నీ కోటీశ్వరులకే ఇస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఆర్థికంగా ఎదగనీయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు.

### హిందీ భాషపై ఇష్టం పెంచుకోవాలి



**చెరుకుపల్లి:** విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు హిందీ కూడా రాయటం, చదవటం, మాట్లాడటం నేర్చుకోవాలని గుళ్లపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.కవిత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు ఎ.మాధవి టి.అనుపమ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలతో కూడిన పోటీలు నిర్వహించారు, అందులో కథలు చెప్పటం, పద్యాలు, బాల గేయాలు, బోధన పరికరాల ప్రదర్శన, పాటలు పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం వి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ నాంచారయ్య, ఉపాధ్యాయులు జక్రయ్య, బి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

### పురుగు ముందుల వినియోగంపై అవగాహన

**మంగళగిరి:** ప్రతి రైతు నాణ్యమైన విత్తనాలతో పాటు పచ్చి రొట్ట ఎరువులు వాడాలని, పంట సరళిలో పప్పు ధాన్యపు పంటలు ఉండేలా చూసుకోవాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మి తెలిపారు. నగర పరిధిలోని నూతక్కిలో బుధవారం రాష్ట్రీయ కెమికల్, ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ పీఎం ప్రణామ్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్ జిల్లా ఇన్‌చార్జి విశాల్‌రావు పాల్గొని పొటాష్ ఎరువులు వాడకం గురించి తెలిపారు. నూతక్కి శ్రీనివాసరావు, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### యూపీహెచ్‌సీలో వరల్డ్ బ్యాంక్ బృందం



**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని ఇందిరా నగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీని బుధవారం వరల్డ్ బ్యాంక్ బృందం సందర్శించింది. వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ గణేష్, మొహిర్ అహ్మదేవ్‌లు ఓపీ, ఈహెచ్ఆర్, నేషనల్ ప్రోగ్రామ్స్ అమలు, ఎన్క్యాస్ స్టాండర్డ్స్ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్టేట్ క్వాలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి యూపీహెచ్‌సీలకు భవిష్యత్తులో వరల్డ్ బ్యాంక్ కూడా సహాయం చేయాలని భావిస్తోందని తెలిపారు. స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్ డాక్టర్ నరేంద్ర, వాసు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

### అన్ని కోణాల్లో చోరీ కేసు దర్యాప్తు

**మంగళగిరి:** బంగారం చోరీ కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. చోరీ ఘటన అనుమానాస్పదంగా ఉందని, విజయవాడ నుంచి నాగరాజును ఎవరూ ఫాలో చేయలేదన్నారు. అసలు వ్యాపారులు ఐదు కేజీలు బంగారం తీసుకెళ్లడం అంతా అనుమానాస్పదంగా ఉందన్నారు. చోరీ జరిగిందా లేదా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. అడిషనల్ ఎస్పీ పరిశీలించి, సీన్ కన్‌స్ట్రక్షన్ చేసి, పలు సూచనలు చేశారని చెప్పారు. ఉన్నతాధికారుల సూచనలతో చోరీ ఘటనను పటిష్టంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### శ్రీశైల క్షేత్రానికి 2 టన్నుల ఊరగాయ పచ్చళ్లు



**మంగళగిరి టౌన్:** మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రానికి రెండు టన్నుల 400 కిలోల ఊరగాయ పచ్చళ్లను పంపుతున్నట్లు విజయ పికిల్స్ అధినేత కాటూరి రాము, లక్ష్మి కుమారి దంపతులు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నుంచి శ్రీశైల మల్లికార్జున స్వామి అన్నదాన కేంద్రానికి బుధవారం ఊరగాయ పచ్చళ్లను ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భంగా కాటూరి రాము మాట్లాడుతు మహాశివ రాత్రి సందర్భంగా సుమారు రూ.8.50 లక్షలు విలువచేసే ఐదు రకాల పచ్చళ్లను పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాము దంపతులను పలువురు సత్కరించారు.

## దాతల సహకారం మరువరానిది

**జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి**



హెచ్‌ఐవీ బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి.

**తెనాలిఅర్బన్:** హెచ్ఐవీ, లెప్రసీ బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. సర్వ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం 100 మంది హెచ్ఐవీ బాధితులు, 20 మంది లెప్రసీ బాధితులకు జిల్లా వైద్యశాలలో నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఆర్‌టీ సెంటర్‌లో ఆరు వేల మంది హెచ్ఐవీ బాధితులు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అలాంటి వారికి మంచి పోషకాహారం అందించేలానే ఉద్దేశంతో సర్వ్ ట్రస్ట్ నిర్వాహకులు వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్‌లు లీన లావణ్య, శాంతి, ఆశిక, ఆర్ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు, ఎఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అంకినీడు ప్రసాద్, వైద్యులు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వండి

**జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ**



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, పరిశీలకులు ప్రేమ్ కుమార్

**తెనాలిఅర్బన్:** నేటి యువత చదువుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడలను విస్మరించటం బాధకరమని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. జేఎంజే కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల పట్ల అందరు ఆసక్తిని పెంచుకుని వాటిలో రాణించాలని సూచించారు. క్రీడల పరిశీలకులు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలలో రాణించి అనేక మంది ఉన్నత స్థితికి చేరుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా క్రీడాకారులకు కొంత రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ సుజాత మాట్లాడుతూ రెండు రోజులు పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో అయిదు టీంలు పాల్గొంటాయన్నారు. మొదటి మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల జట్టులు ఆడాయని, బాపట్ల కళాశాల జట్టు 8–3 పాయింట్‌లతో గెలుపొందిందని చెప్పారు. కార్యక్రమంలో పలు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్‌లు డాక్టర్ సుశీలమ్మ, వై.వెలంగిణి రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

**రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి**



కుండీలో మొక్క నాటుతున్న ఆర్డీఓ నేలపు రామలక్ష్మి

**రేపల్లె రూరల్:** మొక్కలు నాటటమే కాకుండా వాటిని కాపాడటం ప్రతి ఒక్కరూ తమ నైతిక బాధ్యతగా తీసుకుని పర్యావరణ పరిరక్షకులుగా మారాలని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ నేలపు రామలక్ష్మి కోరారు. పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని వినాయకుడి ఆలయం ఎదురు రహదారిలో చెత్తను తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ రేపల్లె, గ్రీన్ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను రహదారులపై, కాల్వలలో పడవేయరాదన్నారు. చెత్తకుండీలలోగాని, ఇంటింటికీ వచ్చే పారిశుద్ధ్య కార్మికులకుగాని అందించి స్వచ్ఛ రేపల్లెకు సహకరించాలని కోరారు. అదేవిధంగా మొక్కలు నాటటం, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకుని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాలని కోరారు. ఈ సందర్భంగా రహదారి పక్కనే కుండీలను ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేఎల్‌యూలో ట్రిపుల్ ఈ కార్యశాల ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్యశాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బీఆర్ ప్రకాష్ మాట్లాడుతూ డీఎస్టీ, ఏఎన్ఆర్ఎఫ్, కేఎల్‌యూ సంయుక్తంగా ప్రాయోజిత అంతర్జాతీయ కార్యశాలను ప్రారంభించామని పేర్కొన్నారు. పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ నెక్స్ట్ జనరేషన్స్ ఎనర్జీ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ సొల్యూషన్స్ ఛాలెంజెస్, హ్యాండ్ ఆన్ అప్లికేషన్స్ అనే అంశంపైన టెక్నికల్ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యశాలలో పునరుత్పాదక శక్తి మార్పిడి, ఎలక్ట్రిక్ వెహికల్ డ్రైవ్, చార్జింగ్ టెక్నాలజీపైన వక్తలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథి సామ్రాజ్ సోలార్ ఇండస్ట్రీస్ సీఈఓ ఎ.అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశ ఇంధన అవసరాల కోసం సౌర శక్తి మార్పిడి డొమైన్‌లో వ్యవస్థాపకుల ఆవశ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వి. శివనాగేశ్వరరావు, వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ టి.రామకృష్ణారావు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బీఆర్ ప్రకాష్, కార్యశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**ఫిరంగిపురం:** ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని ఇమ్మిగ్రూప్ ఆఫ్ ఇనిస్ట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఇమ్మానియేల్ ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఇమ్మి నర్సింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ ప్రకాష్ మాట్లాడుతూ కళాశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ పి.రంజన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 59 మంది విద్యార్థులు రక్తదానం చేశారని చెప్పారు. అనంతరం వీల్ చైర్లు, చేతి కర్రలు పంపిణీ చేశామన్నారు. కళాశాల డీన్ డాక్టర్ జాషువా ఐజాక్ ఇమ్మి, ఆర్నాల్డ్ జోవాధన్, ప్రిన్సిపల్ శ్రీమదన్, శిరీష, మాధవ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

- మండల కేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లో కార్ఫ్స్ సంస్థ వ్యవస్థాపకుడు పి.రంజన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. రంజన్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సెయింట్ జేవియర్ కళాశాల ప్రిన్సిపల్ జీవన్ మణిబాబు, కార్ఫ్స్ సంస్థ డైరెక్టర్ కె.మేరి, రంజన్‌బాబు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, సంస్థ జాయింట్ డైరెక్టర్ కె.పుష్పలత, సీజీసీ ప్రెసిడెంట్ ఆర్. అనిత, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ యం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.